TG/TEL/25/A3731

నిజం
దృష్టి తెలుగు న్యూస్

హైదరాబాద్ ఎడిటర్: వరుదు సుజాత సంపుటి:-1 సంచిక:-252 పేజీలు:-4 గురువారం 27- 08 - 2026

SIMULTANEOUSLY PRINTED AT ADHILABAD I HYDERABAD |NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR| KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

కుప్పకూలిన ఇరాన్ కరెన్సీ.. ఒక డాలర్‌కు 20 లక్షల రియాల్స్!

- ఇరాన్ కరెన్సీ రియాల్ రికార్డు స్థాయిలో పతనం
- ఒక అమెరికా డాలర్‌కు 20 లక్షల రియాల్స్‌కు చేరిన విలువ
- అమెరికా ఆంక్షలు, యుద్ధం కారణంగా తీవ్రమైన సంక్షోభం
- ఆకాశాన్నంటిన ధరలతో సామాన్యుల అవస్థలు
- జీతాలకు, ఖర్చులకు పొంతన లేక ప్రజల ఇబ్బందులు

ఇరాన్ కరెన్సీ రియాల్ చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఫ్రీ మార్కెట్‌లో ఒక అమెరికా డాలర్ విలువ ఏకంగా 2 మిలియన్ల (20 లక్షల) ఇరానియన్ రియాల్స్‌కు చేరింది. అమెరికా విధించిన కఠిన ఆంక్షలు, ఇజ్రాయెల్‌తో కొనసాగుతున్న యుద్ధం కారణంగా ఇరాన్ - మిగతా 2 లో

భూకంపం వచ్చిందా? నేపాల్ జల విలయానికి కారణం ఇదేనా?

- నేపాల్‌ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు, 22 మంది మృతి
- 105 మంది భారతీయులతో సహా 348 మంది గల్లంతు
- భూకంపంతో కొండచరియలు విరిగిపడటమే కారణమని అనుమానం
- నేపాల్‌కు అన్ని విధాలా సాయం అందిస్తామని ప్రధాని మోదీ హామీ
- మరోసారి వరద ముప్పు పొంచి ఉందని అధికారుల హెచ్చరిక

పొరుగు దేశం నేపాల్‌లో ప్రకృతి బీభత్సం సృష్టించింది. టిబెట్ సరిహద్దుకు సమీపంలో ఆకస్మిక వరదలు పోటెత్తాయి. రసువా జిల్లాలోని భోటేకోశీ నదిలో సంభవించిన ఈ జల ప్రళయంలో ఇప్పటివరకు 22 మంది - మిగతా 2 లో

మల్లు భట్టివిక్రమార్కతో భేటీ అందుకే కలిశానన్న రాజగోపాల్ రెడ్డి

- భట్టి విక్రమార్కతో భేటీపై క్లారిటీ ఇచ్చిన రాజగోపాల్ రెడ్డి
- నియోజకవర్గ అభివృద్ధి, నిధుల కోసమే కలిశానని వెల్లడి
- తనది స్వచ్ఛమైన కాంగ్రెస్ రక్తమని వ్యాఖ్య
- కొండా సురేఖ వివాదంపై అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్ అని స్పష్టీకరణ

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో జరిగిన భేటీపై మునుగోడు ఎమ్మెల్యే - మిగతా 2 లో

కేసీఆర్ పాలన ప్రజా సంక్షేమంగా సాగితే

- రేవంత్ పాలన భూముల వ్యాపారంగా సాగుతోంది: హరీశ్ రావు
- కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాల వల్ల హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటోందన్న హరీశ్
- పార్కులు, ప్లాట్లు, ప్రభుత్వ స్థలాలు కనిపిస్తే అక్కడ భూములను అమ్మేస్తున్నారని ఆరోపణ
- లక్షల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కొంటున్నారని మండిపాటు

నాడు కేసీఆర్ పాలన ప్రజా సంక్షేమ కేంద్రంగా సాగితే, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి పాలన - మిగతా 2 లో

గ్రామాల నుంచి ఒలింపిక్స్ దాకా!

- కొరియా నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీతో యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీ అవగాహన ఒప్పందం
- 2036 ఒలింపిక్స్‌లో పతకాలు సాధించేలా ప్రోత్సాహం
- 'ఎక్స్'లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి

రాష్ట్రంలోని గ్రామాలు, పట్టణాల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి.. అంతర్జాతీయ స్థాయి శిక్షణతో వారిని ఒలింపిక్స్ వేదిక వరకు తీసుకెళ్లే దిశగా ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ.. దక్షిణ కొరియాలోని ప్రతిష్ఠాత్మక 'కొరియా నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీ (కేఎన్ఎస్‌యూ)'తో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించి బుధవారం 'ఎక్స్' వేదికగా కీలక అంశాలను ఆయన పంచుకున్నారు. ప్రపంచ స్థాయి క్రీడా శిక్షణ, స్పోర్ట్స్ సైన్స్, హైపెర్ఫార్మెన్స్ ఎడ్యుకేషన్ తదితర రంగాల్లో ఈ భాగస్వామ్యం

నేపాల్‌లో జల విలయం ప్రధాని బాలేన్ షాతో మాట్లాడిన మోదీ

- నేపాల్‌ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు
- 105 మంది భారతీయులు సహా 384 మంది పర్యాటకులు గల్లంతు
- సహాయక చర్యలు ముమ్మరం
- నేపాల్ ప్రధానితో ఫోన్ లో మాట్లాడిన మోదీ, సాయానికి సిద్ధమని ప్రకటన

పొరుగు దేశం నేపాల్‌ను భారీ వరదలు ముంచెత్తాయి. రసువా ప్రాంతంలోని భోటే కోశీ నదిలో బుధవారం ఆకస్మికంగా సంభవించిన వరదల కారణంగా పెను విషాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో

ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ సభపై న్యూయార్క్‌లో వివాదం

మేయర్‌పై అమెరికన్ సింగర్ ఫైర్

- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ సభపై న్యూయార్క్‌లో మొదలైన వివాదం
- సభను వ్యతిరేకిస్తున్న మేయర్‌పై అమెరికన్ సింగర్ మేరీ మిల్బెన్ విమర్శలు
- మోదీ, బీజేపీపై వ్యతిరేకతతోనే సభను అడ్డుకుంటున్నారన్న మిల్బెన్
- ఆగస్టు 29న మ్యాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో "యూనివర్సల్ వన్నెస్" పేరిట ఈవెంట్

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్ సంఘచాలక్ మోహన్ - మిగతా 2 లో

'భారత్ ధర్మశాల కాదు': 2047కు అమిత్ షా భారీ భద్రతా బ్లూప్రింట్

- 2047 అభివృద్ధి లక్ష్యానికి అంతర్గత భద్రత కీలకమని అమిత్ షా వ్యాఖ్య
- చొరబాట్లు, ఉగ్రవాదం, డ్రగ్స్‌పై ముందస్తు చర్యలకు పిలుపు
- అక్రమ చొరబాట్ల నుంచి దేశాన్ని విముక్తం చేయడమే లక్ష్యమని వెల్లడి
- 'భారత్ ధర్మశాల కాదు' అంటూ అక్రమ వలసదారులపై తీవ్ర వ్యాఖ్యలు
- కొత్త క్రిమినల్ చట్టాల పూర్తి అమలుకు ఏడాది గడువు లక్ష్యం

2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యానికి పటిష్ఠ అంతర్గత భద్రతే పునాది - మిగతా 2 లో

ఆ శాఖకు నేను సంరక్షకుడిని మాత్రమే

- ముంబైలో ఫార్చ్యూన్ ఇండియా సంస్థ '40 అండర్ 40' అవార్డుల కార్యక్రమం
- ముఖ్య అతిథిగా హాజరైన నారా లోకేశ్
- ఆర్పీఎస్జీ గ్రూప్ వైస్ చైర్మన్ శాశ్వత్ గోయెంకా అడిగిన ప్రశ్నలకు లోకేశ్ జవాబులు
- కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న నారా బ్రహ్మణి

వ్యాపారమైనా, రాజకీయమైనా తాను నిర్వహించే సంస్థలకు, శాఖలకు కేవలం - మిగతా 2 లో

ఇక రాష్ట్రమంతటా 'సంజీవని' సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

- జనవరి 1 నుంచి ఏపీలో 'సంజీవని' ప్రాజెక్టు అమలు
- కుప్పం, చిత్తూరులో విజయవంతం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తరణ
- ఏఐ, డిజిటల్ హెల్త్ రికార్డులకు ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం ఆదేశం
- ప్రజల ఆరోగ్య సమాచారానికి పూర్తి భద్రత, గోప్యత
- కుటుంబాలపై వైద్య ఖర్చుల భారం తగ్గించడమే లక్ష్యం

ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ 'సంజీవని' ప్రాజెక్టును జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

పోలవరం వద్ద గోదావరికి పోటెత్తుతున్న వరద.. 48 గేట్లు ఎత్తివేత

- రెండు, మూడు రోజులుగా ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలు
- పోలవరం ప్రాజెక్ట్ కాఫర్ డ్యామ్ వద్ద 30.30 మీటర్లకు చేరుకున్న గోదావరి నీటిమట్టం
- 4.10 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్న అధికారులు

గత రెండు, మూడు రోజులుగా తెలంగాణతో పాటు ఎగువ ప్రాంతాలలో పడుతున్న భారీ వర్షాల వల్ల గోదావరి నదిలోకి వరద - మిగతా 2 లో

TG/TEL/25/A3731
నిజం
దృష్టి తెలుగు న్యూస్
గురువారం 27- 08 - 2026

పోలవరం వద్ద గోదావరికి పోటెత్తుతున్న వరద.. 48 గేట్లు ఎత్తివేత

మొదటిపేజీ తరువాయి – భారీ వర్షాల వల్ల గోదావరి నదిలోకి వరద నీరు పోటెత్తుతుంది. ఈ క్రమంలో పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి ప్రవాహం తీవ్రతరమైంది. ప్రాజెక్టు పరిధిలోని ఎగువ కాఫర్ డ్యామ్ వద్ద గోదావరి నీటిమట్టం 30.30 మీటర్లకు చేరుకోగా, స్పిల్ వే వద్ద నీటిమట్టం 30.20 మీటర్లుగా నమోదైంది. వరద నీటిని క్రమబద్ధీకరించేందుకు అధికారులు స్పిల్ వేకు చెందిన 48 గేట్లను ఎత్తివేసి, దిగువకు 4.10 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గోదావరి వరద ప్రభావంతో దేవీపట్నం మండలంలోని ప్రసిద్ధ గండిపోశమ్మ ఆలయాన్ని వరద నీరు చుట్టుముట్టింది. ఆలయ ప్రాంగణంలోని క్యూ లైన్లు, చుట్టుపక్కల ఉన్న దుకాణాలు పూర్తిగా నీట మునిగిపోయాయి. పి.గొందూరు నుంచి నాగులపల్లి గ్రామాల మధ్య రహదారిపైకి వరద నీరు చేరుకోవడంతో అమ్మవారి ఆలయానికి వెళ్లే దారిలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. నదిలో నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉన్నందున, పర్యాటకుల భద్రత దృష్ట్యా పాపికొండల విహారయాత్రకు వెళ్లే బోట్ల రాకపోకలను నిలిపివేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

కేసీఆర్ పాలన ప్రజా సంక్షేమంగా సాగితే

మొదటిపేజీ తరువాయి – భూముల వ్యాపారం కేంద్రంగా నడుస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఈరోజు ఏర్పాటు చేసిన 22ఏ బాధితుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఎక్కడ పార్కులు, ప్లాట్లు, ప్రభుత్వ స్థలాలు కనిపిస్తే అక్కడ భూములను విక్రయిస్తూ భావి తరాలకు కనీసం స్థలం కూడా లేకుండా చేస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. సామాన్య ప్రజల ఆస్తులనేమో 22ఏ నిషేధిత జాబితాలోకి నెడుతూ, ప్రభుత్వ భూములను మాత్రం ముఖ్యమంత్రి సోదరుల చేతుల్లోకి వెళ్లేలా చేస్తున్నారని విమర్శించారు. లక్షలాది ఎకరాల అసైన్డ్ భూములను పేదల వద్ద నుంచి లాక్కొని, కమీషన్ల కోసం పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. ఎప్పుడు 'హైడ్రా' వచ్చి ఇళ్లను కూలుస్తుందో, ఎప్పుడు 22ఏ పేరుతో తమ భూములను గుంజుకుంటారోనని ప్రజలు భయాందోళనలతో బతుకుతున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు కోటి ఎకరాలను, ఒక్క హైదరాబాద్‌లోనే లక్షలాది ఆస్తులను రేవంత్ ప్రభుత్వం 22ఏ జాబితాలో చేర్చిందని ఆరోపించారు. ప్రభుత్వం చేసిన తప్పుకు ప్రజలను ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిప్పుతూ... జాబితా నుంచి భూములను తొలగించడానికి 30 శాతం వరకు కమీషన్లు వసూలు చేస్తున్నారని విమర్శించారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఈ 22ఏ అంశంపై ప్రభుత్వాన్ని తీవ్రంగా నిలదీస్తామని స్పష్టం చేశారు. బాధితులు ఎవరూ బ్రోకర్లకు ఒక్క రూపాయి కూడా ఇవ్వొద్దని, ప్రజల ఆస్తులను కాపాడే బాధ్యతను బీఆర్ఎస్ పూర్తిగా తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

మల్లు భట్టివిక్రమార్కతో భేటీ.. అందుకే కలిశానన్న రాజగోపాల్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి – కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టత ఇచ్చారు. బుధవారం ప్రజాభవన్‌లో ఉపముఖ్యమంత్రిని కలిసిన ఆయన, కేవలం నియోజకవర్గ అభివృద్ధి, నిధుల కేటాయింపులపై చర్చించేందుకే ఈ భేటీ జరిగిందని వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన రాజగోపాల్ రెడ్డి, తాను కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తున్న సీనియర్ నాయకుడినని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తాను తీవ్రంగా వ్యతిరేకించానని, 2018 ఎన్నికల్లో ఎంతోమంది సీనియర్లు ఓటమి పాలైనప్పటికీ మునుగోడు ప్రజలు తన వెంటే నిలిచారని ఆయన గుర్తుచేశారు. తన వ్యాఖ్యలు పార్టీ బలోపేతం కోసమే తప్ప, ఎవరినీ వ్యక్తిగతంగా విమర్శించేందుకు కాదని స్పష్టం చేశారు. "మాది స్వచ్ఛమైన కాంగ్రెస్ రక్తం. ఎన్నికల సమయంలో కొత్తగా వచ్చిన వారికి టికెట్లు కేటాయించారు. అయితే, పార్టీని నమ్ముకున్న కార్యకర్తలను కాపాడుకోవాల్సిన బాధ్యత నాయకత్వంపై ఉంది" అని ఆయన వ్యాఖ్యానించారు. మంత్రి కొండా సురేఖకు సంబంధించిన వివాదంపై స్పందిస్తూ, ఈ విషయంలో పార్టీ అధిష్ఠానం నిర్ణయమే అంతిమమని రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే స్పందించారని, క్రమశిక్షణ సంఘం కూడా సంబంధిత వ్యాఖ్యలపై పీసీసీకి నివేదిక సమర్పించిందని తెలిపారు. తనపై విమర్శలు చేసే వారు ముందుగా ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించిన ఆయన, తాను ఎల్లప్పుడూ పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉంటానని వెల్లడించారు. రాహుల్ గాంధీని దేశ ప్రధానిని చేయడమే తమ ప్రధాన లక్ష్యమని రాజగోపాల్ రెడ్డి పునరుద్ఘాటించారు.

కుప్పకూలిన ఇరాన్ కరెన్సీ.. ఒక డాలర్‌కు 20 లక్షల రియాల్స్!

మొదటిపేజీ తరువాయి – ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. ఈ పరిణామాలతో సుమారు 9.2 కోట్ల జనాభా ఉన్న ఆ దేశంలో ప్రజల జీవనం దుర్భరంగా మారింది. అల్ జజీరా ప్రచురించిన ఒక కథనం ప్రకారం, దశాబ్దాలుగా కొనసాగుతున్న అంతర్జాతీయ ఆంక్షలు, ముఖ్యంగా అణు కార్యక్రమంపై విధించిన ఆంక్షలు ఇప్పటికే ఇరాన్ ఆర్థిక వ్యవస్థను బలహీనపరిచాయి. దీనికి తోడు, ఈ ఏడాది ఫిబ్రవరి 28న ప్రారంభమైన యుద్ధం పరిస్థితిని మరింత దిగజార్చిందని ఆ కథనం పేర్కొంది. కరెన్సీ విలువ పడిపోవడంతో దేశంలో ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగిపోయింది. ఈ కరెన్సీ పతనం సామాన్యుడి జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. యుద్ధానికి ముందు 2 మిలియన్ల రియాల్స్‌కు దాదాపు 4 కిలోల టమాటాలు, అర కిలో చికెన్, లీటర్ వంట నూనె వచ్చేవి. కానీ ఇప్పుడు అవే డబ్బులకు వాటిలో సగం కూడా రావడం లేదని ప్రజలు వాపోతున్నారు. టమాటాల ధర 71 శాతం, చికెన్ ధర 74 శాతం, వంట నూనె ధర 177 శాతం పెరిగాయి. నిత్యావసరాలకే ఈ పరిస్థితి ఉంటే, మందుల ధరల పెరుగుదల మరింత తీవ్రంగా ఉంది. ఉదాహరణకు, ఇన్సులిన్ ధర 642 శాతం పెరిగింది. ధరల పెరుగుదలతో ప్రజలు మాంసం, చికెన్, కొత్త బట్టలు వంటివి కొనడం పూర్తిగా తగ్గించుకున్నారు. ప్రభుత్వ కనీస వేతనం నెలకు సుమారు 166 మిలియన్ రియాల్స్ (దాదాపు 82 డాలర్లు) ఉండగా, ఖర్చులు మాత్రం ఆకాశాన్నంటాయి. టెహరాన్‌లోని ఒక రిటైల్ వ్యాపారి తన అమ్మకాలు 40 శాతం పడిపోయాయని, చాలా వ్యాపారాలు మూతపడే ప్రమాదంలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీర్ఘకాలిక ఆంక్షలు, యుద్ధం వల్ల దెబ్బతిన్న ఉత్పత్తి, అమెరికా నౌకాదళ దిగ్బంధనం, అంతర్జాతీయ మార్కెట్లకు దూరం కావడం వంటివి ఈ సంక్షోభానికి ప్రధాన కారణాలని విశ్లేషకులు చెబుతున్నారు. నెల జీతంతో నెల రోజుల అవసరాలు ఎంతవరకు తీరుతాయన్నదే ఇప్పుడు ఇరాన్ ప్రజల ముందున్న అతిపెద్ద ప్రశ్నగా మారింది. కాగా, ఇరాన్‌లో పెద్ద సంఖ్యలను సులభంగా చెప్పేందుకు 10 రియాల్స్‌ను ఒక "టోమన్"గా వ్యవహరిస్తుంటారు.

ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ సభపై న్యూయార్క్‌లో వివాదం

మొదటిపేజీ తరువాయి – భగవత్ పాల్గొననున్న కార్యక్రమంపై అమెరికాలో వివాదం రాజుకుంది. న్యూయార్క్‌లోని ప్రఖ్యాత మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో జరగనున్న ఈ వేడుకను న్యూయార్క్ నగర మేయర్ జోహ్రాన్ మమ్దానీ వ్యతిరేకించడంపై అమెరికన్ గాయని, నటి మేరీ మిల్బెన్ తీవ్రంగా స్పందించారు. ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీపై ఉన్న రాజకీయ వ్యతిరేకతతోనే ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవాలని చూస్తున్నారని ఆమె ఆరోపించారు. సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా స్పందించిన మేరీ మిల్బెన్, "మేయర్ మమ్దానీ వంటి సోషలిస్టులు భారత ప్రధాని నరేంద్ర మోదీని, బీజేపీని వ్యతిరేకిస్తున్నందునే ఈ సభను అడ్డుకుంటున్నారు. మాడిసన్ స్క్వేర్ గార్డెన్ ఒక ప్రైవేట్ సంస్థ. అది సోషలిస్టుల అభీష్టానుసారం కాకుండా పెట్టుబడిదారీ విధానంలో నడుస్తుంది. కాబట్టి ఈ కార్యక్రమం జరిగి తీరుతుంది" అని స్పష్టం చేశారు. "మీరు కూడా పెట్టుబడిదారులుగా ఎదిగి, నిధులు సమకూర్చుకుని, మాడిసన్ స్క్వేర్‌ను అద్దెకు తీసుకుని మీ మోదీ వ్యతిరేక ర్యాలీలు నిర్వహించుకోండి" అని ఆమె చురక అంటించారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా, "యూనివర్సల్ వన్ నెస్ సెలబ్రేషన్" పేరుతో ఆగస్టు 29న ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సుమారు 5,000 మంది ప్రవాస భారతీయులు హాజరవుతారని అంచనా వేస్తున్న ఈ వేడుక కోసం మోహన్ భగవత్ ఇప్పటికే న్యూయార్క్ చేరుకున్నారు. మరోవైపు, ఈ కార్యక్రమానికి తాను మద్దతు ఇవ్వడం లేదని మేయర్ మమ్దానీ స్పష్టం చేశారు. తాను చూసిన భారతదేశం అందరినీ కలుపుకుపోయే లౌకిక గణతంత్రమని, అయితే ప్రస్తుతం పెరుగుతున్న మినహాయింపువాదం ఆందోళన కలిగిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. పలు పౌర, మానవ హక్కుల సంఘాలు సైతం ఈ కార్యక్రమాన్ని రద్దు చేయాలంటూ మాడిసన్ స్క్వేర్ గార్డెన్ యాజమాన్యంపై ఒత్తిడి తీసుకువస్తున్నాయి.

ఇక రాష్ట్రమంతటా 'సంజీవని'.. సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

మొదటిపేజీ తరువాయి – కుప్పం, చిత్తూరు నియోజకవర్గాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసిన ఈ ప్రాజెక్టు అద్భుతమైన ఫలితాలు ఇవ్వడంతో, దీనిని రాష్ట్రమంతా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన 90 రోజుల కార్యాచరణ ప్రణాళికను అధికారులు సీఎంకు వివరించారు. ఈ సమీక్ష సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారిత ఆరోగ్య సేవలు, ప్రతి పౌరునికి డిజిటల్ హెల్త్ రికార్డులు, వ్యాధుల ముందస్తు గుర్తింపు, సరైన చికిత్స, ఆ తర్వాత ఫాలో-అప్‌కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. డిజిటల్ హెల్త్ రికార్డులతో ఈ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అమలు చేస్తే వైద్య సేవల్లో పెను మార్పులు తీసుకురావచ్చని, దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రజల ఆరోగ్య సమాచారం యొక్క గోప్యతకు, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు అధికారులను గట్టిగా ఆదేశించారు. ప్రతి వ్యక్తి ఆరోగ్యానికి సంబంధించిన అప్‌డేట్‌లను నేరుగా వారి మొబైల్ ఫోన్‌లకే పంపేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని సూచించారు. వ్యాధులను ముందుగానే గుర్తించి, నివారణ చర్యలు చేపట్టడం, సరైన సమయంలో చికిత్స అందించడం ద్వారా కుటుంబాలపై పడే వైద్య, విద్యా ఖర్చుల భారాన్ని గణనీయంగా తగ్గించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ఈ లక్ష్య సాధనలో 'సంజీవని' ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వం విశ్వసిస్తోంది.

ఆ శాఖకు నేను సంరక్షకుడిని మాత్రమే

మొదటిపేజీ తరువాయి – సంరక్షకుడిని (కస్టోడియన్) మాత్రమేనని, తనకు అప్పగించిన బాధ్యతలను మరింత మెరుగైన స్థితికి తీసుకెళ్లడమే తన లక్ష్యమని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. పెట్టుబడుల ఆకర్షణలో స్పీడ్, సర్వీస్, స్టెబిలిటీ అనే మూడు సూత్రాలే తమ విజయ రహస్యాలని ఆయన వెల్లడించారు. దేశంలోని యువ వ్యాపారవేత్తలు, ప్రతిభావంతులకు ఫార్చ్యూన్ ఇండియా సంస్థ '40 అండర్ 40' పేరుతో ముంబైలో అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్, మంత్రి నారా లోకేశ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ వేడుకలో భాగంగా, డైరీ రంగంలో విలువ ఆధారిత ఉత్పత్తుల విభాగంలో హెరిటేజ్ సంస్థ సాధించిన ప్రగతికి గాను, ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణికి కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ చేతుల మీదుగా 'ఫార్చ్యూన్ ఇండియా 40 అండర్ 40' అవార్డును ప్రదానం చేశారు. ఏపీ పెట్టుబడుల రహస్యం ఇదే అనంతరం జరిగిన ఇంటరాక్టివ్ సెషన్‌లో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ఆర్పీఎస్జీ గ్రూప్ వైస్ చైర్మన్ శాశ్వత్ గోయెంకా అడిగిన పలు ప్రశ్నలకు ఆయన ఆసక్తికర సమాధానాలిచ్చారు. "ప్రభుత్వ నిర్వహణలో మీరు క్రమశిక్షణ పాటిస్తున్నారు. పొదుపు గురించి మాట్లాడారు. ఈ ఆలోచన మీకు ఎక్కడి నుంచి వచ్చింది?" అని గోయెంకా ప్రశ్నించగా, లోకేశ్ బదులిచ్చారు. "వ్యాపారంలో అయినా, రాజకీయాల్లో అయినా మనం నిర్వహించే సంస్థలకు కేవలం సంరక్షకులం మాత్రమేనని నేను బలంగా నమ్ముతాను. ఒక మంత్రిగా నేను ఇక్కడికి వచ్చింది కేవలం మానవ వనరుల అభివృద్ధి, విద్యాశాఖకు సంరక్షకుడిగా మాత్రమే. గతంలో వ్యాపారంలో, ఇప్పుడు ప్రభుత్వ బాధ్యతల్లోనూ ఇదే విధానాన్ని అనుసరిస్తున్నాను" అని వివరించారు. పెట్టుబడుల కోసం అన్ని రాష్ట్రాలు పోటీ పడుతున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా నిలబెట్టేది ఏమిటన్న ప్రశ్నకు లోకేశ్ రెండు ప్రధాన కారణాలను తెలిపారు. "మొదటిది, మేము అనుసరించే మూడు 'ఎస్'ల విధానం. స్పీడ్ (వేగం), సర్వీస్ (సేవ), స్టెబిలిటీ (స్థిరత్వం). మేము ఎంత వేగంగా అనుమతులు ఇస్తున్నామో చాలా పరిశ్రమలకు తెలుసు. ఇక సర్వీస్ విషయానికొస్తే, పెట్టుబడిదారులకు వారి ప్రాజెక్టుల పురోగతిపై ప్రతి శనివారం రాత్రి నేనే స్వయంగా మెసేజ్ పంపి ఫీడ్‌బ్యాక్ ఇస్తాను. మూడోది, విధానాల్లో స్థిరత్వం. ప్రభుత్వాలు మారినా మా విధానాలు కొనసాగుతాయి. ఇది పెట్టుబడిదారులకు భరోసా ఇస్తుంది" అని లోకేశ్ అన్నారు. "రెండో ముఖ్య కారణం ముఖ్యమంత్రి చంద్రబాబు గారు. సీబీఎన్ అంటే అదొక బ్రాండ్. ఆయనకు అద్భుతమైన ట్రాక్ రికార్డు ఉంది. పెట్టుబడులకు అవసరమైన తలుపులు తెరువగల ముఖ్యమంత్రి ఉండటంతో మా పని సగం సులభమవుతుంది. మిగిలిన సగం పనిని నేను సమావేశ మందిరంలో ఒప్పందాన్ని ఖరారు చేయడం ద్వారా పూర్తి చేస్తాను. మా ఇద్దరి భాగస్వామ్యమే ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా నిలుపుతోంది" అని లోకేశ్ తెలిపారు. కుటుంబ వ్యాపారాల్లో ఉన్న యువత తమ కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి, కొత్త రంగాల్లో పరిశోధనలపై భారీగా పెట్టుబడులు పెట్టాలని లోకేశ్ పిలుపునిచ్చారు. అంతరిక్షం, క్వాంటమ్ టెక్నాలజీ, మెటీరియల్ సైన్సెస్ వంటి రంగాల్లో భారతదేశం ఎంతో సాధించగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. "రేపటి తరం గర్వపడేలా ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి నగరం చరిత్ర సృష్టించబోతోంది. ప్రపంచమంతా చెప్పుకునేలా ఒక మోడల్‌ను ఏపీలో నిర్మించాలన్నది మా లక్ష్యం. ఈ మార్పులో మీరంతా భాగస్వాములు కావాలి. మేము చేసే ప్రతి తప్పు నుంచి నేర్చుకోవడానికి, రాష్ట్రాన్ని మరింత మెరుగ్గా తీర్చిదిద్దడానికి మీ సలహాలు స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నాం" అని యువ పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి లోకేశ్ అన్నారు.

భూకంపం వచ్చిందా? నేపాల్ జల విలయానికి కారణం ఇదేనా?

మొదటిపేజీ తరువాయి – ప్రాణాలు కోల్పోగా, 105 మంది భారతీయులతో సహా దాదాపు 348 మంది గల్లంతయ్యారు. ఈ ఘటనతో రసువాతో పాటు ధాదింగ్, నువాకోట్ జిల్లాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ ఆకస్మిక వరదల్లో అనేక గ్రామాలు, వంతెనలు, రోడ్లు, జలవిద్యుత్ ప్రాజెక్టులు కొట్టుకుపోయాయి. బురద, శిథిలాల కింద అనేక మంది చిక్కుకుపోయారు. గల్లంతైన వారిలో 105 మంది భారతీయులు, 93 మంది నేపాల్ పౌరులు, 12 మంది బ్రిటిష్, ముగ్గురు అమెరికన్ పౌరులు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

భూకంపమే కారణమా?

ఈ దుర్ఘటనకు భూకంపం ప్రేరేపిత కొండచరియలే కారణమని నేపాల్ విదేశాంగ మంత్రి షిషిర్ ఖనాల్ పార్లమెంటుకు వివరించారు. స్థానిక కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 8:30 గంటల సమయంలో టిబెట్ భూభాగంలో 4.4 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు యూఎస్ జియలాజికల్ సర్వే (ఖూ+ూ) నమోదు చేసింది. ఈ భూకంపం ధాటికి భారీగా మంచు, రాళ్లతో కూడిన కొండచరియలు విరిగిపడి టిబెట్ వైపు ఉన్న లెండే ఖోలా నది ప్రవాహానికి అడ్డుపడ్డాయి. దీంతో తొలుత నీరు భారీగా నిలిచిపోయింది. ఆ ప్రవాహం అంతకంతకు అధికం కావడంతో, ఆ అడ్డుకట్ట ఒక్కసారిగా తెగిపోయింది. దాంతో భోటేకోశీ నదిలోకి వరద పోటెత్తిందని ప్రాథమికంగా నిర్ధారించారు.

సహాయక చర్యలు.. భారత్ అండ

నేపాల్ సైన్యం, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. అయితే, వరద ఉధృతి తగ్గకపోవడంతో హెలికాప్టర్లు దిగలేని పరిస్థితి నెలకొంది. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలిస్తున్నారు. ఈ ఘటనపై భారత ప్రధాని నరేంద్ర మోదీ, నేపాల్ ప్రధాని బాలెన్ షాతో ఫోన్‌లో మాట్లాడి సంతాపం తెలిపారు. అన్ని రకాల మానవతా సహాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. నిత్యావసరాలు, మందులతో పాటు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపే అంశాన్ని భారత్ పరిశీలిస్తోంది. మరోవైపు, చైనా కూడా సరిహద్దుల్లో సహాయక బృందాలను మోహరించింది. కాగా, నది ఎగువన ఇంకా అవరోధాలు ఉండటంతో మరోసారి వరద వచ్చే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో బీహార్, ఉత్తరప్రదేశ్ వంటి భారత సరిహద్దు రాష్ట్రాల్లోనూ వరద హెచ్చరికలు జారీ చేశారు.

నేపాల్‌లో జల విలయం ప్రధాని బాలేన్ షాతో మాట్లాడిన మోదీ

మొదటిపేజీ తరువాయి – 100 మందికి పైగా భారతీయులతో సహా వందలాది మంది పర్యాటకులు గల్లంతయ్యారు. ఈ విపత్కర పరిస్థితుల్లో నేపాల్‌కు అండగా నిలుస్తామని భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. బుధవారం నేపాల్ ప్రధాని బాలేంద్ర షాతో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడారు. వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు. నేపాల్‌కు అవసరమైన అన్ని రకాల మానవతా సాయం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని ఆయన హామీ ఇచ్చారు. "ఈ కష్టకాలంలో నేపాల్ సోదర సోదరీమణులకు భారత ప్రజలు తోడుగా ఉంటారు. సహాయక చర్యల కోసం మన బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి" అని మోదీ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. నేపాల్ టూరిజం బోర్డు (ఎన్టీబీ) విడుదల చేసిన ప్రాథమిక నివేదిక ప్రకారం, ఈ వరదల్లో మొత్తం 384 మంది పర్యాటకులు గల్లంతయ్యారు. వీరిలో 105 మంది భారతీయులు, 93 మంది నేపాల్ పౌరులు, మిగిలిన వారు విదేశీయులు ఉన్నారు. గల్లంతైన విదేశీయులలో యూకే, ఆస్ట్రేలియా, అమెరికా, మలేషియా, దక్షిణాఫ్రికా, నెదర్లాండ్స్ దేశాలకు చెందిన వారు ఉన్నట్లు అధికారులు తెలిపారు. అయితే, ఈ సంఖ్య ప్రాథమికమైనదేనని, ట్రావెల్ ఏజెన్సీలు, స్థానిక అధికారులతో కలిసి వివరాలను ధ్రువీకరిస్తున్నామని ఎన్టీబీ స్పష్టం చేసింది. గల్లంతైన వారు తొమ్మిది వేర్వేరు ట్రావెల్ ఏజెన్సీల ద్వారా నేపాల్ పర్యటనకు వచ్చారని ప్రాథమిక సమాచారం. కాఠ్మండు టైమ్స్ కథనం ప్రకారం, ఈ దుర్ఘటనలో ఇప్పటివరకు ఏడుగురు మరణించినట్లు నిర్ధారణ అయింది. గల్లంతైన వారి ఆచూకీ కోసం అధికారులు, సహాయక బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. సమాచారం లేదా సహాయం కోసం పర్యాటకులు, వారి కుటుంబ సభ్యుల కోసం నేపాల్ టూరిజం బోర్డు పలు ఎమర్జెన్సీ నంబర్లను (1234, 1144, 9851289445) జారీ చేసింది. వరద ప్రభావిత ప్రాంతాల్లోని పర్యాటకులు ఆందోళన చెందవద్దని, అధికారిక ప్రకటనలను అనుసరించాలని సూచించింది.

'భారత్ ధర్మశాల కాదు': 2047కు అమిత్ షా భారీ భద్రతా బ్లూప్రింట్

మొదటిపేజీ తరువాయి – అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. చొరబాట్లు, ఉగ్రవాదం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, భవిష్యత్ భద్రతా సవాళ్లపై ఇప్పటి నుంచే ముందస్తు వ్యూహాలతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో జరిగిన ఇంటెలిజెన్స్ బ్యూరో 'జాతీయ భద్రతా సదస్సు' ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు.

ముప్పు రాకముందే చర్యలు

మరో 15 నుంచి 20 ఏళ్లలో ఎదురయ్యే భద్రతా సవాళ్లను ఇప్పటి నుంచే గుర్తించాలని అమిత్ షా సూచించారు. అవి పెద్ద సంక్షోభాలుగా మారకముందే తిప్పికొట్టే వ్యూహాలు సిద్ధం చేయాలని చెప్పారు. దేశంలో మూడు ప్రధాన అంతర్గత భద్రతా హాట్‌స్పాట్ల నుంచి ఎదురైన ముప్పులను సమర్థంగా అధిగమించామని పేర్కొన్నారు.

'ఇది ధర్మశాల కాదు'

సరిహద్దు భద్రతపై కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టిందని షా తెలిపారు. ఎనిమిది నెలలుగా అన్ని భూ సరిహద్దు రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపామని చెప్పారు. నాలుగు అంచెల సరిహద్దు భద్రతా ప్రణాళికను రాష్ట్రాలకు అందించామని వెల్లడించారు. "ఇది ధర్మశాల కాదు. ఈ దేశ పౌరులకు మాత్రమే ఇక్కడ నివసించే హక్కు ఉంది" అని షా వ్యాఖ్యానించారు. అక్రమ చొరబాటుదారులు జాతీయ భద్రత, ఆర్థిక స్థిరత్వం, జనాభా సమతుల్యతకు ముప్పని హెచ్చరించారు.

3 ఏళ్లలో కేసుల పరిష్కారమే లక్ష్యం

కొత్తగా తెచ్చిన మూడు క్రిమినల్ చట్టాలను వచ్చే ఏడాదిలో పూర్తిస్థాయిలో అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు షా చెప్పారు. క్రిమినల్ కేసులు సుప్రీంకోర్టు స్థాయి వరకు మూడేళ్లలో పరిష్కారమయ్యేలా వ్యవస్థను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. శిక్షల శాతాన్ని 25 శాతం పెంచడమూ లక్ష్యమేనన్నారు.

ఉగ్రవాదం, డ్రగ్స్‌పై ఉక్కుపాదం

పీఎఫ్ఐపై నిషేధం తర్వాత చేపట్టిన చర్యలను కేంద్ర-రాష్ట్ర సమన్వయానికి ఉదాహరణగా షా పేర్కొన్నారు. ఉగ్రవాద నెట్‌వర్క్‌లను పూర్తిగా ధ్వంసం చేసేందుకు 'ప్రహార్' వ్యూహాన్ని రోజువారీ భద్రతా కార్యకలాపాల్లో అమలు చేయాలని సూచించారు. మాదకద్రవ్యాలపై 'డిటెక్ట్, డిస్‌రప్ట్, డిస్ట్రాయ్' విధానాన్ని అనుసరించాలని రాష్ట్రాలకు పిలుపునిచ్చారు. 2026–29 మాదకద్రవ్య నియంత్రణ విజన్ డాక్యుమెంట్‌ను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు.

ఏఐతో కొత్త భద్రతా కవచం

సీసీటీఎన్ఎస్, ఐసీజేఎస్, నాట్‌గ్రిడ్, నాఫిస్ డేటాబేస్‌ల అనుసంధానంతో శక్తిమంతమైన నిఘా వ్యవస్థ ఏర్పడిందని షా తెలిపారు. కృత్రిమ మేధ, డేటా విశ్లేషణ, ప్రవర్తనా సరళి అధ్యయనం ద్వారా భవిష్యత్ ముప్పులను ముందే గుర్తించాలని యువ అధికారులకు సూచించారు.

గ్రామాల నుంచి ఒలింపిక్స్ దాకా!

దోహదపడుతుందన్నారు. తెలంగాణ క్రీడా ప్రతిభకు ప్రపంచస్థాయి శిక్షణ, క్రీడా విజ్ఞానం, అత్యుత్తమ శిక్షణ విధానాలను అనుసంధానించే వారధిగా ఈ భాగస్వామ్యం నిలుస్తుందన్నారు. అథ్లెట్ ట్రైనింగ్, స్పోర్ట్స్ సైన్స్, హైపెర్ఫార్మెన్స్ ఎడ్యుకేషన్‌లో కేఎన్ఎ?సయూ అనుభవాన్ని తెలంగాణ యువ క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. గత దక్షిణ కొరియా పర్యటన సందర్భంగా తాను, కేఎన్ఎ?సయూ ఉన్నత ప్రతినిధి బృందంతో సమావేశమైన విషయాన్ని సీఎం గుర్తుచేశారు. కేఎన్ఎస్‌యూ అధ్యక్షుడు మూన్ వోన్-జే సహా ఉన్నతస్థాయి ప్రతినిధులతో అప్పట్లో విస్తృత చర్చలు జరిపినట్లు తెలిపారు. ప్రతిపాదిత యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీతో, కేఎన్ఎ?సయూ భాగస్వామ్యంపై ఆ సందర్భంగా చర్చలు జరిగాయని, ఇప్పుడు అవి ఎంవోయూ రూపంలో కార్యరూపం దాల్చాయని వెల్లడించారు.

32 పతకాల్లో 16 కేఎన్ఎస్‌యూకే..

ప్రపంచ క్రీడా రంగంలో కేఎన్ఎస్‌యూకు ఉన్న ప్రాధాన్యాన్ని పారిస్ ఒలింపిక్స్ ఫలితాలు చాటి చెబుతున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పారిస్ ఒలింపిక్స్‌లో దక్షిణ కొరియా సాధించిన 32 పతకాల్లో 16 పతకాలు కేఎన్ఎ?సయూలో శిక్షణ పొందిన క్రీడాకారులే సాధించారని తెలిపారు. అదే తరహా క్రీడా నైపుణ్యం, అత్యుత్తమ ప్రదర్శన సంస్కృతిని తెలంగాణలోనూ తీసుకురావాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఈ కీలక భాగస్వామ్యానికి కృషి చేసిన క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఆ శాఖ అధికారులు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రతినిధులను ఈ సందర్భంగా సీఎం అభినందించారు. ప్రపంచ క్రీడా ప్రమాణాలను తెలంగాణ యువ క్రీడాకారులకు చేరువ చేసేందుకు ఈ ఒప్పందం కొత్త అవకాశాలను తెరుస్తుందని అభిప్రాయపడ్డారు. భారత్ 2036 ఒలింపిక్స్ వైపు అడుగులు వేస్తున్న నేపథ్యంలో తెలంగాణ కూడా అందుకు సిద్ధమవుతోందని తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన క్రీడా ఈవెంట్‌కు ఆతిథ్యమివ్వడమే కాకుండా.. భారత్‌కు గర్వకారణంగా నిలిచే క్రీడాకారులను తయారు చేయడమే

రాజకీయ రసవత్తరం రవన్న తోనే సాధ్యం..!?

పార్టీ బలోపేతం.. వచ్చే ఎన్నికల్లో పాగా పక్కా!

రవన్న మార్క్ కోసం జనం ఎదురుచూపులు..!

మాజీ ఎమ్మెల్యే అంజన్న వారసుడిగా

రాబోతున్న రవన్న..!?

అజయుడు అంజన్న.. అదరడు రవన్న..!

షాద్నగర్ గడ్డపై గులాబీ జెండా ఖాయం..!

మల్లే శ్రీశైలం ???

నిజం న్యూస్ షాద్ నగర్ ఆగస్టు 26: షాద్ నగర్ గడ్డపై వచ్చే ఎన్నికల్లో పెను మార్పులు చోటు చేసుకోబోతున్నాయి.! మాజీ ఎమ్మెల్యే, సౌమ్యుడు, అందరివాడు ఎలగనమోని అంజయ్య యాదవ్ వారసుడిగా మాజీ ఎంపీపీ ఎలగనమోని రవి యాదవ్ రాజకీయంలో ప్రకంపనలు సృష్టించబోతున్నారు. తండ్రికి తగ్గ తనయుడిగా రాజకీయ పగ్గాలు చేపట్టబోతున్నారు. ఇక చూసుకో షాద్నగర్ గడ్డపై రాజకీయ రసవత్తరం రవన్నతోనే సాధ్యమని ఆయన అభిమానులు, గులాబీ శ్రేణులు తొడగొట్టి చెబుతున్నారు. 2029 ఎన్నికలకు సమయం ఉండడంతో ఇప్పటి నుంచే యుద్ధానికి సిద్ధమవుతున్నారు. షాద్నగర్ గడ్డపై ఎమ్మెల్యేగా పోటీ చేసి గులాబీ జెండాను ఎగరేబోతున్నారు. అంజన్న చూపులతో ఆదేశిస్తే కార్యాచరణలో రవన్న దూసుకుపోతున్నారు. అంజన్నకు ఎదురేది.. రవన్నకు అలుపేది అన్నట్లుగా షాద్నగర్ గులాబీ జెండాను భుజాలపై వేసుకుని పయనిస్తున్నాడు. ప్రజల నాడిని... గులాబీ శ్రేణుల ఆశయాలను ఊపిరిగా భావిస్తూ భవిష్యత్తుకు పునాదులు వేయబోతున్నారు. ఈ మధ్యకాలంలో యాదవ సామాజిక వర్గం పార్టీలకు అతీతంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ స్వగృహానికి వెళ్లి సామాజిక సమావేశానికి హాజరు కావడం కూడా రాజకీయంగా వారికి ఉన్న పట్టు గురించి తెలియజేస్తుంది. అలాగే స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ ఛైర్మన్ వీర్లపల్లి శంకర్ సైతం తన కోడలు రాణి వివాహానికి ఇంటికి వెళ్లి మరి పత్రిక ఇచ్చి స్వయంగా ఆహ్వానించడం ప్రస్తుతం రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిందనీ చెప్పవచ్చు. ఈ పత్రిక ఇచ్చిన వైనం మాజీ ఎమ్మెల్యే అంజయ్య ఇంటి గడప తొక్కిన వీర్లపల్లి శంకర్ రాజకీయ ధైర్యంతో ఎవరి రాజకీయ పలుకుబడి ఏమిటో చెప్పకనే చెబుతుందని రాజకీయాల్లో ఒక పెను సంచలనంగా మారుతుంది. ఎమ్మెల్యే నేటి రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా ఎంతో పెద్దమనసుతో మాజీ ఎమ్మెల్యే ఇంటికి వెళ్లడం మంచి మార్పుకు కారణమని కొందరు అంటుండగా కాంగ్రెస్ పార్టీలో మాత్రం ప్రత్యర్థి ఇంటి గడప తొక్కడం కొంత ఇబ్బందికర పరిస్థితి గానే చెప్పవచ్చు. అదే బిఆర్ఎస్ పార్టీలో మాత్రం ఫుల్ జోష్ నెలకొంది. ముఖ్యంగా యువనేత రవీందర్ యాదవ్ అంజన్న రాజకీయ వారసుడిగా లైన్ క్లియర్ అవుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఒక్కసారి మారుతున్న తాజా రాజకీయ పరిణామాలను పరిశీలిస్తే..

నిన్నటి కథ..

రాజకీయాల్లో తూక్యా.. మైక్యా... అంటూ నిన్నటిదాకా తిట్టుకున్న కాంగ్రెస్ - బీఆర్ఎస్ రాజకీయాలు మనకు తెలిసిందే. ప్రస్తుతం ఈ వాతావరణంలో చాలా వరకు మార్పు కనిపిస్తుంది. ఏడు పదులు దాటిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఇక రాజకీయంగా పక్కకు జరిగి కుమారుడిని తెరమీదికి తెచ్చే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మరోవైపు రవీందర్ యాదవ్ కూడా పదేళ్లపాటు తండ్రికి అన్ని విధాల అండగా ఉండి పాలనలో తన భాగస్వామ్యాన్ని అందించడంతో పాటు రెండవసారి తన తండ్రి గెలుపుకు కారణమయ్యారు. ఓటమి తర్వాత కూడా నిరంతరం యాక్టివ్ గా ఉంటూ కార్యకర్తలను వదులుకోకుండా గ్రామాలు తిరుగుతూ బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గంలో పటిష్టంగా ఉండేలా కృషి చేస్తున్నారు. రానున్న ఎన్నికల్లో విజయం కోసం ఇప్పటినుంచే ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి వర్గం ప్రత్యేకంగా ఏర్పడడం పార్టీకి కొంత శరాఘాతంగా మారినప్పటికీ ఆ లోటును పూడ్చి పార్టీకి జవసత్వాలు అందించే దిశగా రవి అడుగులు వేస్తున్నారు. దీనికి తోడు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కూడా రవీందర్ యాదవ్ నే తన ప్రత్యర్థిగా భావిస్తున్నారని స్పష్టమవుతుంది. ఎన్నడూ అంజయ్య యాదవ్ ఇంటి గడప కూడా తొక్కని వీర్లపల్లి శంకర్ స్వయంగా వెళ్లి అతడిని వివాహానికి ఆహ్వానించడం ప్రత్యర్థులకు మింగుడు పడనిదిగా మారింది. ఇంత శత్రుత్వం ఉన్న అది రాజకీయాలకే పరిమితం అని, మంచి, చెడు సమయాలలో ఒకరికి ఒకరు కలిసి ఉండాలని సంకేతాన్ని ఈ ఇరువురు నాయకులు ఇవ్వడం రాజకీయ పెను మార్పులకు ఊతాన్ని ఇస్తున్న అంశం. ప్రస్తుతం రాజకీయాలకు ఇలాంటి మార్పులే కావాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఇదేంటి.. ఇలా జరిగింది..

నిన్న మొన్నటి దాకా రాజకీయ శత్రువులుగా ఉన్న కాంగ్రెస్-బీఆర్ఎస్ వర్గాలలో మాత్రమే కాదు.. ప్రత్యర్థులలో కూడా రాజకీయంగా ఇద్దరు ఇద్దరే అనిపించుకున్న ఎమ్మెల్యే శంకర్,

రవీందర్ యాదవుల కలయిక ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఒకవైపు ఇప్పటికే బీఆర్ఎస్ లో నవీన్ రెడ్డి వర్గం రూపంలో రాజకీయ కుంపటి ఉంది. ఇలాంటి దశలో ఎమ్మెల్యే రవీందర్ యాదవ్ కి ప్రాధాన్యతనివ్వడం చర్చకు దారి తీస్తుంది. మరోవైపు బిజెపి నాయకులకు కూడా ఇది మింగుడు పడడం లేదు. దశాబ్దాలుగా షాద్ నగర్ నియోజకవర్గంలో తమ సత్తా చాటాలని ప్రయత్నిస్తున్నా .. బిజెపి నాయకులు మారినా రాజకీయ సీన్లతో ఎలా ముందుకు వెళ్లాలో అర్థంకాని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. రవీందర్ యాదవ్ కూడా రాజకీయంగా ఎన్నికల సమయంలో పోరాడాలి.. ఇప్పుడు విమర్శలు అవసరం లేదు.. పార్టీని పటిష్టం చేయడం ముఖ్యం అనే ధోరణిలో గ్రామ గ్రామానికి వెళుతూ బీఆర్ఎస్ నేతల్లో మంచి ఉత్సాహాన్ని నింపుతూ వివాదాల జోలికి పోకుండా ముందుకు సాగుతుండడం ద్వారా ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేది రవీందర్ యాదవ్ అన్న చర్చ ప్రతి చోటా సాగుతోంది. కొంతమంది కార్యకర్తలు అభిమానులు అన్నను ఎమ్మెల్యేగా చూడాలి అంటూ సోషల్ మీడియాలో ప్రచారాలతో హోరెత్తిస్తున్నారు. దీన్నిబట్టి భారత రాష్ట్ర సమితిలో రవి యువసత్తా కనిపించే విధంగా తాజా పరిణామాలు దీనిని బలపరుస్తున్నాయి. దీనితో నియోజకవర్గ రాజకీయం రసవత్తరంగా మారింది.

దేశంలోనే యుపిఐ పేమెంట్స్ విప్లవాత్మక మార్పు, చారిత్రాత్మక విజయం

బిజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి

అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్

నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి, ఆగస్టు 26: దేశవ్యాప్తంగా యుపిఐ పేమెంట్స్ పద్ధతిని ప్రవేశపెట్టి 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు శ్రీరామ్ నగర్ ఏ బ్లాక్ లో నిర్వహిస్తున్న రిరు వీధివ్యాపారుల కూరగాయల మార్కెట్ సందర్శించిన ...బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10 సంవత్సరాల క్రితం కేంద్ర ప్రభుత్వం, మన ప్రియతమ ప్రధాని నరేంద్ర మోదీ గారు డిజిటల్ ఇండియా పేరుతో తీసుకొచ్చిన చారిత్రాత్మక నిర్ణయం యుపిఐ పేమెంట్స్ పై కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ నాయకులు చిదంబరం ఎద్దేవ చేస్తూ టీ షాపులు, కూరగాయల వ్యాపారులు , చిన్న కిరాణా షాపులు కు మెషిన్స్ ఎవరిస్తారు, ఇంటర్నెట్ ఎవరిస్తారు, వైఫై ఎక్కడ ఉంటుంది , ఇది ఒక తప్పుడు నిర్ణయం అన్నారని, కానీ

ఇప్పుడు 10 సంవత్సరాల తర్వాత మాస్తే ప్రతి చిన్న కూరగాయలు, టీ , మరియు బట్టల షాప్ ,ప్రతి పెద్ద వ్యాపారి యుపిఐ పేమెంట్స్ వాడుతున్నారని, తెలియజేసేందుకు నేను స్వయంగా కూరగాయలు అమ్మే దగ్గర కు వెళ్లి స్వయంగా కూరగాయలు కొని యుపిఐ పేమెంట్ చేయడం జరిగిందని మరియు చాయ్ దుకాణం వద్ద టీ కొని యుపిఐ పేమెంట్ చేయడం జరిగిందని వాళ్లని అక్కడ ఉండే వినియోగదారులను కనుక్కుంటే చాలా ఉపయోగకరం గా ఉందని ఇంతకు ముందు చిన్న చిన్న షాపు లకు వెళ్ళినప్పుడు చిల్లర కోసం చాలా ఇబ్బందులు ఉండేవని ఇప్పుడు అలాంటివి ఏమి లేవని తెలియజేశారన్నారు, ఈ ప్రభుత్వ నిర్ణయానికి చరిత్రాత్మక విజయమని కొనియాడారు, దేశంలో ప్రతి ఒక్కరు యుపిఐ పేమెంట్స్ వాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా వాడుతున్నారని ఇప్పుడైనా కాంగ్రెస్ పార్టీ నాయకులు దేశం కోసం తీసుకొచ్చే నిర్ణయాలు , మార్పుల పై విమర్శలు , ఎద్దేవ చేసేముందు ఆలోచించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఓబుల్ రెడ్డి, ఎల్లారెడ్డి, ఎయిర్టెల్ వెంకటేష్, రమేష్ యాదవ్, వెంకటేష్, మరియు స్థానిక నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

22 ఏ భూములపై ఉధృత పోరాటం

ప్రజల ఆస్తులను కాపాడేందుకు ఆమరణ

నిరాహార దీక్ష కైనా సిద్ధం: ఎమ్మెల్యే

మాధవరం కృష్ణారావు

ప్రభుత్వం ప్రజలకు గుదిబండగా

మారకూడదు: జయప్రకాష్ నారాయణ

నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, ఆగస్టు 26: కూకట్ పల్లి నియోజకవర్గం కెపిహెచ్బి డివిజన్ ఎన్.ఆర్.ఎస్.ఏ కాలనీ కమ్యూనిటీ హాల్ లో22ఏ భూముల సమస్యపై కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు , మాజీ మంత్రివర్యులు హరీశ్‌రావు , లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్ నారాయణ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తూ ప్రజాప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోకుండా నిర్ణయాలు తీసుకుంటోందని ఆరోపించారు. ఎన్నో ఏళ్లుగా పట్టా భూముల్లో నివసిస్తున్న ప్రజల ఆస్తులను 22ఏ జాబితాలో చేర్చడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. భూసమస్యపై ప్రజల తరఫున ఉద్యమైన పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే ప్రజలకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భూదందాకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ.. ప్రజల భూముల విషయంలో ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రజలకు న్యాయం జరిగే వరకు తాము పోరాటం కొనసాగిస్తామని, అవసరమైతే ప్రజల కోసం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తాను ఆమరణ నిరాహార దీక్ష కు సిద్ధమని హెచ్చరించారు. ప్రజల ఆస్తులను కాపాడేందుకు ఎంతటి పోరాటానికైనా సిద్ధమని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో ప్రజలకు తాగునీరు, విద్యుత్, మౌలిక వసతులు, పార్కులు, రహదారులు, ప్రజా రవాణా వంటి అనేక సదుపాయాలు కల్పించామని నాయకులు పేర్కొన్నారు. కేసీఆర్ కిట్ వంటి సంక్షేమ పథకాలను అమలు చేశామని గుర్తుచేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెట్టకుండా ఉన్న భూములను నమ్ముకోవడంపైనే దృష్టి సారిస్తోందని విమర్శించారు. 22ఏ భూముల విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే రానున్న రోజుల్లో పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ప్రజల ఆస్తులను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణమే 22ఏ నిర్ణయాన్ని పునఃపరిశీలించి, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లోక్ సత్తా అధినేత జయ ప్రకాష్ నారాయణ్ మాట్లాడుతూ ప్రభుత్వం అంటే ప్రజలకు అండగా ఉండాలని అంతే కానీ ప్రజలకు గుది

బండగా మారకూడదు అని అన్నారు..అన్ని ఆధారాలతో ఉన్న ఈ భూములను ఎలా 22ఏ లో చేర్తారు.. ఇదే నిజంగా ప్రజలను ఇబ్బంది పెట్టడమే అని ఆవేదన వ్యక్తం చేశారు....అంతే కాకుండా అధికారులు కూడా ఇవన్నీ చూసి చూడనట్లు ఉండటం దారుణమైన విషయం అని ప్రభుత్వం ఈ నిర్ణయం మార్చుకునే వరకు ప్రజల పక్షాన పోరాడతా ము అని అన్నారు...ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ,లోక్ సత్తా అధినేత జయ ప్రకాష్ నారాయణ్,రాగిడి లక్ష్మారెడ్డి,మాజీ కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, సబిహా గౌసుద్దీన్, పండాల శిరీషా బాబు రావు, ముద్దం నరసింహ యాదవ్, పండాల సతీష్ గౌడ్, తూము శ్రావణ్ కుమార్, జూపల్లి సత్యనారాయణ, మాధవరం రంగా రావు మరియు శేరిలింగంపల్లి నాయకులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు...

మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో పాల్గొన్న బండి రమేష్

నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, ఆగస్టు 26: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్లో మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అరవింద్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన వేడుకల్లో టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ బండి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ ముస్లిం సోదరులకు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలియజేశారు. మహ్మద్ ప్రవక్త బోధించిన శాంతి, ప్రేమ, సోదరభావం, మానవత్వం వంటి గొప్ప విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని అన్నారు. సమాజంలో అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవం, ఐక్యతతో కలిసి మెలిసి జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మరియు మైనార్టీ నాయకులు దండుగుల యాదగిరి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, మాకినేని వినోద్ ,కిరణ్ గౌడ్, నల్లోల రాజేందర్, శివ యాదవ్, విజయ్ కాంత్ రెడ్డి, రాకేష్ గౌడ్, అంజద్, ముస్తఫా అలీ, ఆదిల్ పఠాన్, మున్నా, దీపక్, సతీష్ పటేల్, అస్లాం, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ బోర్డ్ వెస్టన్ విభాగం ఈఈ అంకం రావు సస్పెండ్

నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి ఆగస్టు 26: తెలంగాణ హౌసింగ్ బోర్డ్ వెస్టెడ్ విభాగంలో ఈఈగా విధులు నిర్వహిస్తున్న కారుమూరి అంకం రావును హౌసింగ్ బోర్డ్ శాఖ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. విధుల్లో నిర్లక్ష్యం, పరిపాలన వ్యవహారాల్లో లోపాలకు సంబంధించి ఆయనపై పలు ఆరోపణలు వచ్చినట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో అంకంరావుపై శాఖ పరమైన చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా గతంలో ఎల్ఐజీ 630 ప్లాట్లలోని కాళీ ఇళ్లను కొంతమందికి అక్రమించినట్లు, అలాగే డ్రైవర్ కు ఓ ఇంటిని కేటాయించినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చాయి. అదేవిధంగా కోట్ల రూపాయల విలువైన వెస్టెడ్ విభాగానికి చెందిన భూములను అన్యాక్రాంతం కాకుండా కాపాడడంలో నిర్లక్ష్యం వహించారని ఫిర్యాదులు కూడా అందినట్లు తెలుస్తుంది. కెపిహెచ్బి కాలనీలోని కొన్ని హౌసింగ్ బోర్డు స్థలాలను నిబంధనలకు విరుద్ధంగా అనధికారికంగా ఫుడ్ స్టాల్ లకు అద్దెకు ఇచ్చినట్లు కూడా ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ మేరకు వరుసగా అందిన ఫిర్యాదుల నేపథ్యంలో హౌసింగ్ బోర్డు శాఖ అంకం రావు పై సస్పెన్షన్ వేటు వేసినట్లు సమాచారం.

భవిష్యత్తు భరోసా బి.ఆర్ తోనే సాధ్యం

మాజీ మంత్రివర్యులు డాక్టర్ లక్ష్మారెడ్డి

సూరారం లో బిజెపి కాంగ్రెస్ పార్టీలో నుంచి చేరికలు

గులాబీ కండవా వేసి ఆహ్వానించిన డాక్టర్ లక్ష్మారెడ్డి

నిజం న్యూస్ కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగస్టు 26 బాలానగర్ : ప్రజా పాలన పేరుతో తెలంగాణ రాష్ట్రంలో దగా పాలన చేస్తున్న కాంగ్రెస్ సార్ కొరకు రాబోయే ఎన్నికల్లో ఘోర పరాభవం తప్పదని తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రివర్యులు డాక్టర్ లక్ష్మారెడ్డి హెచ్చరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పనైపోయిందని, బీజేపీని నమ్మే పరిస్థితుల్లో జనం లేరని స్పష్టం చేశారు. బుధవారం ఈ మేరకు మహబూబ్నగర్ జిల్లా బాలనగర్ మండలం సూరారం గ్రామంలో కాంగ్రెస్, బిజెపి పార్టీల నుంచి బిఆర్ఎస్ గూటికి చేరారు. వీరికి డాక్టర్ లక్ష్మారెడ్డి గులాబీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పాలనలో వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుందని, అంతర్గత కుమ్ములాటలు, వాటాల పంచాయతీతో కాంగ్రెస్ ఉక్కిరిబిక్కిరి అవుతుందని ఎద్దేవా చేశారు. పాత కొత్త అనే తేడా లేకుండా అందరూ బీఆర్ఎస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి,కేసీఆర్ ని ముఖ్యమంత్రి చేసేందుకు పని చేయాలని మాజీ సూచించారు. సూరారం గ్రామానికి చెందిన మాజీ వార్డు మెంబర్లు పూజారి నరసింహులు, రాపల్లె యాదయ్య, గొల్ల యాదయ్య, గడ్డల లింగం, పూజారి జగన్, లింగంతో పాటు 30 మంది బిజెపి కార్యకర్తలు మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ లో చేరారు. సూరారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు దుబ్బ కృష్ణ, గ్రామ మాజీ ఉప సర్పంచ్ పూదూరు లింగం యాదవ్, పవన్ రెడ్డి, జావెద్ తదితరులు ఆధ్వర్యంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ మండల మాజీ వైస్ ఎంపీపీ వడ్ల వెంకటాచారి, చెన్నారెడ్డి, గోపాల్ రెడ్డి, సుప్ప ప్రకాష్, తెప్ప మణి ముదిరాజ్, కాగుల ప్రకాష్ యాదవ్, శ్యామ్ సుందర్ రెడ్డి, మొల్గర శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును వేగవంతం చేయాలి: ముఖ్యమంత్రి ఆదేశం

నిజం న్యూస్ హైదరాబాద్, ఆగస్టు 26: హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్డీ 'బోధి పెవిలియన్'లో మూసీ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి, సైబరాబాద్ కమిషనర్ స్నేహ, రంగారెడ్డి కలెక్టర్ నారాయణ రెడ్డి, మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి, ఎంఆర్డీసీఎల్ ఎండీ ఈ.వి. నరసింహా రెడ్డి, జేఎండీ గౌతమి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సమీక్షలోని ముఖ్యాంశాలు:

భూ సేకరణ & స్పష్టమైన పాలసీ: మూసీ ప్రాజెక్ట్ భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. ల్యాండ్ పూలింగ్‌తో పాటు ఎఫ్‌టీఎల్ (ఫుల్), బఫర్ జోన్, అప్రెస్ట్ భూముల సేకరణపై స్పష్టమైన విధానాన్ని రూపొందించి, ఎలాంటి న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. టెండర్ల ప్రక్రియ: మూసీ ప్రాజెక్ట్ ఫేజ్-2 పనులకు వీలైనంత త్వరగా టెండర్లు పిలవాలని, అలాగే మంచిరేవుల ఓఆర్ఆర్ వద్ద గాంధీ సరోవర్ అభివృద్ధి పనుల టెండర్లను తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు. ఆర్థిక వనరులు & టీడీఆర్ సమీక్ష: ప్రాజెక్టుల కోసం తక్కువ వడ్డీ రుణాలను సమీకరించడంపై మున్సిపల్ కమిషనర్ దృష్టి సారించాలని తెలిపారు. టీడీఆర్ (TDR) అంశంపై ప్రతి వారం సమీక్ష నిర్వహించాలని స్పష్టం చేశారు. పర్యాటక ప్రోత్సాహం: కొత్వాల్‌గూడ ఎకో పార్కు విస్తృత ప్రచారం కల్పించి పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం, అక్రమ నిర్మాణాలకు వరం

-సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్.

నిజం న్యూస్ కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగస్టు 26: నిజాంపేట్ సర్కిల్ పరిధిలో వెలిసిన మున్సిపల్ అనుమతి లేని బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణాలపై సిపిఐ ఆధ్వర్యంలో నిజాంపేట్ సర్కిల్ మేనేజర్ రమేష్ కు ఫిర్యాదు చేయడం జరిగింది. అనంతరం సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ప్రగతి నగర్, రాజీవ్ గాంధీ నగర్, కౌసల్య కాలనీ, బాచుపల్లి, బాచుపల్లి నుండి మల్లంపేట్ కు వెళ్లే దారిలో, అనురాగ్ కాలనీ, ప్రగతి నగర్లో, బాచుపల్లి లో అనుమతుల లేకుండా పెద్ద ఎత్తున పెద్ద నిర్మిస్తున్నారు. వివిధ ప్రాంతాలలో ఇష్టానుసారం మున్సిపల్ అనుమతులు లేకుండా నిర్మిస్తున్నారు అని గుర్తుచేశారు. ఒక వైపు అనుమతులు లేకుండా నిర్మాణాలు కొనసాగిస్తుంటే టౌన్ ప్లానింగ్ అధికారులు చోద్యం చూస్తూ అని అన్నారు. దాని వల్ల నిజాంపేట్ సర్కిల్ కి రావలసిన డబ్బులు అక్రమార్కుల చేతులోకి వెళ్తున్నాయి అని అన్నారు. ఇంకో వైపు నిజాంపేట్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసిపి ఉంటే టిపిఎస్ ఉండరు, టిపిఎస్ ఉంటే ఏసిపి ఉండరు. వారి మధ్య సమన్వయం లేకపోవడం వల్ల అక్రమ నిర్మాణాలకు వరంగా మారింది అని అన్నారు. గత రెండు రోజుల క్రితం అంజయ్య నగర్లో అక్రమ టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఏదు అంతస్తుల భవనం కూలిపోయింది అలాంటి పరిస్థితి గతంలో ప్రగతి నగర్ లో 2ఫ్లర్ కూలి కూలింది వద్ద జరిగింది. మళ్ళీ అదే బిల్డర్ బాచుపల్లి రోడ్డులో వివిఆర్ కాలేజ్ ఎదురుగా నిజాంపేట్ సర్కిల్ అనుమతులు లేకుండా నిర్మిస్తున్నారు ఇంకా స్థానిక ప్రజలు అంటున్నారు.అని అన్నారు. దానిని కూడా టౌన్ ప్లానింగ్ అధికారులు పరిశీలించలేదు అని కనుక వెంటనే అనుమతులు లేని బహుళ అంతస్తులు, అనుమతులు లేని షెడ్లను టౌన్ ప్లానింగ్ అధికారులు పరిశీలించి అనుమతులు లేని వాటిపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో టౌన్ ప్లానింగ్ అధికారులను ముట్టడిస్తాము అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కార్యదర్శి అశి. యాదయ్య, నిజాంపేట్ సర్కిల్ ఏఐటీయూసీ కన్వీనర్ పొన్నకంటి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

తుమ్మెద రెక్కల మీద మువ్వన్నెవిల్లుల ఆకాశం

1. ఏ పాలపుంతల్ని దాటొచ్చావో కానిఇంతకుముందెన్నడూ మేమెరుగని పిల్లనగ్రోవులపంటవు నువ్వు. లోకం వెంట లోకాన్ని దించి మాకు పల్లకీలు కట్టించిన మెరుపులచెండువు నువ్వు... మడతలు విప్పుకున్న పద్యాలుగా మమ్ము విప్పార్చిన మొగలీసంపెంగల మహోత్సవానివి కదూ నువ్వు

2. ఆ అనిమేష వీక్షణాల నిండా విరగబూచే తీగ సంపెంగల పందిరి పరిచి ఆ పందిళ్ల నిండా నన్నొక చిన్నిచిన్ని పిట్టలగుంపును చేసి%- తీరొక్కరాగాల కోలాటాలాడించి పాడడమే ఎరుగని నన్నెంత మహాగాయకుణ్ణి చేసి ఆహెూ.. ఎన్ని కచేరీలు చేయిస్తున్నావో

3. నీ ఆ పెదవి అంచున విరుపులో దోగాడే పసిసిగ్గు వేలవేల కలువరాయళ్లను దూసిపోస్తూ ఆకాశాల్ని అరచేతికందిస్తుంటే కొత్తపాటల్ని కట్టుకుంటూ ఎన్నిసార్లు కొత్తమొదళ్లమైపోతున్నా ఎఇంకేదో వెలితిలో ఈ చిన్నిగుండెల్ని జోలెలుగా పట్టి నీ కనురెప్పలవాకిట భిక్షుకులం కావడం ఎంతటి మహదానందంగా ఉందో

4. నువ్వే దేవభాషను మాట్లాడుతుంటావో తెలీదుకానీ నీతో సంభాషించడానికి మా వర్ణమాలనంతా మరచిపోయి లిపికందని ఏదో మధురభాషతో నీతో పోటీపడుతున్నా నీ కేరింతలు, ఉంగా, ఊ లతో దేహాన్నంతా చిత్రభాషగా మలచి చిత్తుగా ఓడించేస్తుంటే మనసును చెంగుపట్టి రోజూ వంద ఓటముల్ని ఎత్తుకోవడానికైనా మేం తయారే.

5. ఈ ప్రపంచమింకా బతికుందనడానికి ఈ నేల ఇంకా నవ్వుతూనే ఉందనడానికి ఈ గాలి ఇంకా కలల తొక్కిసలాటలో పండుతూనే ఉందనడానికి కాలం ఇంకా మమ్మల్ని పలకరిస్తూనే ఉందనడానికి ఒకే ఒక్క నిదర్శనం చివుళ్లుతొడిగే కొత్తలోకాల్ని కుక్కి కుక్కి మోసుకొచ్చిన ను.. వ్వే.. గా.

6. మేమూ, కాలం అదిగో ఆ రైలుపట్టాల్లా ఎప్పుడూ ఎడమెడమే అదిగో అక్కడెక్కడో మలుపులో మా దూరాల్ని బద్ధలుకొడుతున్నట్లున్న ఆ దవ్వుల్లో- ఇప్పటికైతే- మా జుగల్‌బందీకి వేదికా నువ్వే , వాద్యమూ నువ్వే గాత్రమూ నువ్వే, గానమూ నువ్వే ముగింపన్నదే లేని కచేరీ నువ్వే

7. ఇసుకకొండల్లా ఎండకాగుతున్న మమ్మల్ని మళ్లీ నదుల్ని చేసిన చిలుకపాటల చిరుజలపాతం లాంటి నీ జలతారునవ్వులు, నేరుగా చందమామలోంచి రా సెలయేళ్లలో ఈత కొట్టొచ్చిన సమీరాల్లాంట నీ తేనెచూపులు తుంచిపోస్తున్న కాశ్మీరాల్లో తూలీ, సోలీ చుక్కల్ని కోసుకున్న మైకంలో- ఓ కొండపల్లిబొమ్మా.. నీకెంత కవిత్వాన్ని బాకీ పడిపోతున్నానో! -యార్లగడ్డ రాఘవేంద్రరావు.

ప్రజల భద్రత కోసం సొంత నిధులతో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసిన పట్వారీ శశిధర్

నిజం న్యూస్ శేర్లింగంపల్లి ప్రతినిధి, ఆగస్టు 26: ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని “పీజేఆర్ నగర్ ఫేస్2” లో శ్రీ రేణుక ఎల్లమ్మ నల్ల పోచమ్మ దేవాలయం నందు ప్రజల భద్రతను మరింత పటిష్టం చేసేందుకు దృష్టిలో ఉంచుకుని “ఉమ్మడి ఆల్విన్ కాలనీ 124 డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు” పట్వారీ శశిధర్ ఆధ్వర్యంలో, తన సొంత నిధులతో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయటం జరిగింది. తమ సొంత నిధులతో “సీసీటీవీ కెమెరాలను” ఏర్పాటు చేసి కాలనీలోని ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని, కాలనీ భద్రతకు తోడ్పడిన మన ప్రజా నాయకులు పట్వారీ శశిధర్ కి “పీజేఆర్ నగర్ ఫేస్2” కమిటీ సభ్యులు,కాలనీవాసులు మరియు కాలనీ పెద్దలు యాదగిరి, శ్రీనివాస్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పట్వారీ శశిధర్ మాట్లాడుతూ, ప్రజల భద్రతే తన ప్రధాన బాధ్యత అని, కాలనీలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు జరుగకుండా,భద్రతా చర్యలను మరింత బలోపేతం చేస్తామని,ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, భద్రతా చర్యల విషయంలో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలియజేశారు.సీసీటీవీ కెమెరాల ఏర్పాటు ద్వారా కాలనీలో భద్రత మరింత పటిష్టం అవుతుందని, అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించేందుకు పోలీసులకు కూడా ఇది సహాయపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నాగయ్య, బాబ్జి కాలనీవాసులు యాదగిరి, శ్రీనివాస్,బాలస్వామి గౌడ్, దశరత్ గౌడ్, రాజు,నరేష్, మల్లేష్, యువకులు మరియు టీం పట్వారీ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ నగర్ లో మహేందర్ ప్యానెల్ ఘనవిజయం

కాలనీ భద్రతకు సీసీ కెమెరాలు.. ఆర్థిక సాయం అందించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు

నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, ఆగస్టు 26: మూసాపేట్ ఆంజనేయ నగర్ రెసిడెన్స్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన జె. మహేందర్ ప్యానల్ సభ్యులు గురువారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు ఎన్నికల్లో విజయం సాధించిన జె. మహేందర్ ప్యానల్ సభ్యులందరినీ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆంజనేయ నగర్ రెసిడెన్స్ అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల, కాలనీవాసుల సంక్షేమం కోసం నూతన పాలకవర్గం సమిష్టిగా కృషి చేయాలని కాలనీ అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశంలో తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని వడ్డేపల్లి రాజేశ్వరరావు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాలనీ సభ్యులు భద్రతా పరంగా కాలనీలో మరింత పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, ప్రస్తుతం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేయడం లేదని వారి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆంజనేయ నగర్ కాలనీవాసుల భద్రతను దృష్టిలో ఉంచుకొని అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించేందుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చి అందుకు కావలసినటువంటి ఆర్థిక సహాయం వారికి అందజేశారు.నూతనంగా ఎన్నికైన పాలకవర్గం కాలనీవాసుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అందరి సహకారంతో ఆంజనేయ నగర్‌ను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని వడ్డేపల్లి రాజేశ్వరరావు సూచించారు.ఈ కార్యక్రమంలో ఉప్పల శేఖర్ గుప్తా, జె. మహేందర్ ప్యానల్ సభ్యులు, కాలనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మిలాద్-ఉన్-నబీ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

నిజం న్యూస్ కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగస్టు 26: కుత్బుల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని రోడా మేస్త్రి నగర్ డివిజన్‌లో మిలాద్-ఉన్-నబీ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ముస్లిం సోదరులకు మిలాద్-ఉన్-నబీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త బోధించిన శాంతి, సోదరభావం, మానవతా విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని కోరారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా, పరస్పర గౌరవంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు... సమాజంలో ప్రతి ఒక్కరు కుల మతాలకతీతంగా మతసామరస్యంతో కలిసిమెలిసి ఉండాలని ఆకాంక్షించారు.. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ సభ్యులు,ముస్లిం మైనార్టీ మత పెద్దలతో పాటు స్థానిక నాయకులు జహంగీర్, సలీం, రషీద్, షాకీర్ తదితరులతో పాటు ముస్లిం యువకులు పెద్ద సంఖ్యలు పాల్గొన్నారు..

సహస్ర వృత్తుల సమస్త చిత్రం




తలచుకోగానే ఎవరైనా కళ్లబడితే వారికి ‘నిండు నూరేళ్ళు’ అంటాం. అట్లా కాపు రాజయ్యకి నిండు ఆయుర్దాయం నేటికి నిండినదేమీ కాదు, మలిదశ తెలంగాణ ఉద్యమంలోనే వారి యాది సంపూర్ణం. శతాయువు మాత్రమే కాదు, వారు అనునిత్యం చిరంజీవి. అయితే ఇక ముందు వారి మరో అంకం సాగనుంది. అదే ఈ వ్యాసం సారాంశం. ఎవరైతే తమ గడుల్లో బలవంతంగా బతుకమ్మ ఆడించారో వారే బతుకమ్మ ఆడే స్థితి తెలంగాణ ఉద్యమం తేనే తెచ్చింది. వాళ్ళ మెడలు వంచి బతుకమ్మను, బోనాలను నెత్తిమీద పెట్టుకునేలా చేయనే చేసింది. అంతేకాదు, సకల జనుల సమిష్టి చేతనలోకి మన సాంస్కృతిక ఆనవాళ్ళు బలీయమై, ఉద్యమ ?సోయిలోకి వచ్చేసరికి మళ్ళీ సజీవ స్మృతిలోకి వచ్చి చేరిన రెండే రెండు బొమ్మలు, రాజయ్య గీసినవే. ఒకటి%-% సద్దుల బతుకమ్మ, రెండు బోనాలు, ఈ రెండు బొమ్మలు రాష్ట్ర పండుగలుగా అయ్యేనాటికి ఎంతో ముందు, అనేక దశాబ్దాల క్రితమే వారు ఆ ఉత్సవాలను అపురూపంగా పదిలపరిచారు. చిత్రమేమిటంటే, ‘ఫక్తు రాజకీయాల దశ’ పోయి ‘ప్రజా పాలన’ అని మూడో దఫా ప్రభుత్వం వచ్చేనాటికి తెలంగాణ తల్లి చేతుల్లో బతుకమ్మ మాయం అయి ఉండొచ్చు గాక. కానీ, ఆయన చేసిన పని అంతకుముందే పరిసమాప్తి అయింది. అవును, వారు చిత్రించి పెట్టిన ఆ రెండు బొమ్మలు చేయవలసిన పని చేశాయి. ఇప్పుడు మిగితావి కూడా బయలుపడతాయి. అదే శత జయంతి ఆన. నేటి (ఆగస్టు 3) సాయంత్రం హైదరాబాద్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కాపు రాజయ్య శత జయంతి ఉత్సవ సందర్భంగా కళా ప్రదర్శన ప్రారంభం. ఆగస్టు పది వరకూ ఉంటుంది. ఈ ప్రదర్శనలో బహుశా అనేక చిత్రాలు నూతన అంకురానికి ప్రేరేపణ ఇస్తాయనే నమ్ముతాను నేను. అవును, రాజయ్య సబ్బండ వర్ణాల చిత్రకారులు. వారు పండుగలు, పబ్బాలను మాత్రమే చిత్రించలేదు. నేడు బీసీ కుల గణన ద్వారా మొదటిసారిగా దేశవ్యాప్తంగా మెజారిటీ ప్రజగణన జరిగే తరుణం ఆసన్నమయ్యే సరికి వారు అసలైన ఉత్సవ రథాన్ని మన ముందుకు చేర్చనే చేర్చారు. ఆయన తీరొక్క కులాన్ని, వారి వ్యావృత్తులతో కూడి, కడు సుందరంగా ఎప్పుడో చిత్రించి ఉన్నారు. ఇకముందు వారి అన్ని చిత్రాలూ ఊరేగక మానవు. వెలికి తీయవలసిన సందర్భం ఇది. ఒక్క మాటలో భారతదేశ చిత్రకళా మండలంలోకి ఒకనాడు పరిపుష్టంగా తులతూగిన తెలంగాణ గ్రామాన్ని, అందలి మెజారిటీ కుల సముదాయాలను కాపు రాజయ్య ప్రతిక్షేపించి చూపినంత ఘనంగా మరొకరు చేయలేదు. వారు సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలను ఉపరితల మానకంగా వేయలేదు. ఆయా వృత్తిదారులను వారి పనిపాటలే రక్తమాంసాలతో తమవైన అచ్చట్లు ముచ్చట్లతో తమవైన అలంకారాలతో ఒక కోలాటంగా చిత్రించి పెట్టారు. నేడు వాటిని చూడటం అంటే వాంఛితంగా నైరూప్యం చేసిన మెజారిటీ ప్రజల గ్రామీణ జీవన ఉత్సవాన్ని తిరిగి వాస్తవికంగా దర్శించడమే. అదే ఇప్పటి కవి సమయం లేదా చిత్రకళా పునరుజ్జీవన సందర్భం.

అనేకులకు వారి బతుకమ్మ, బోనాలతో పాటు రాజయ్య గీసిన రాధాకృష్ణుల చిత్రం తెలుసు. చాలామందికి తాటి చెట్టు ఎక్కుతున్న గౌడ్ తాలూకు ‘రిస్కీ లైఫ్’ తెలుసు. కానీ, వారి కాన్వాసు పెద్దది. అందులో కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, బెస్త, స్వర్ణకారి, మేదరి, పద్మశాలీ, వడ్డెరలు, నకాషీలే కాదు, యాదవులు, దూదేకులు, రజకులు ఎందరో ఉన్నారు. పరమాత్మ, జీవాత్మలతో సహా ఇంకా ఎన్నో చిత్రించారు. నిజానికి వారు సహస్ర వృత్తుల సమస్త చిహ్నంగా చూపింది ‘కళ’ను. అవును. కళే ఒక్కో కులానికి ఉన్న బహుజన ప్రజల అసలైన విద్యా ఉద్యోగ ఔపాధిక సంస్కృతి అని, అదే స్వరాజ్యం అని ఆయన చిత్రించారు. అదే రాజయ్య రాజరికం. నిజానికి బహుజన సమాజాన్ని, ఒక్కో సముదాయంగా తరతరాలుగా వారు చేపట్టి అభివృద్ధి చేసిన పనులను ‘వృత్తులు’ అనే చాలా మంది భావించారు. వాటిని ‘హస్తకళలు’ అనే మాట్లాడారు. కానీ రాజయ్య తన లలిత కళలో ఒక్కో కులాన్ని గొప్ప జీవకళగా అభివ్యక్తం చేసి చూపారు. ఒకరి చేతుల్లో ఒకరు చేయుంచి ఊరు ఉమ్మడిగా సకల కులాల సమ్మేళనంగా, తీరొక్క మనుషుల సమిష్టి జీవన గ్రామంగా ఆయన దేనికదే ఒక బొమ్మగా చిత్రించి పెట్టారు. అదే వారి ‘కళా భవనం’. మరో మాటలో ఆయన గ్రామాన్ని తన జానపద చిత్తమూ చిత్రంతో పల్లకీ ఎక్కేలా చేశారు. ఆ బోయలే అందులో ఊరేగేలా చిత్రించారు. ధ్వంసం కాకముందరి గ్రామాన్ని, మనం కోల్పోయిన గ్రామ పునాదిని, అందలి నాగరికతలను వారు చూపినంత విశిష్టంగా ఇంతటి వైవిధ్యంతో దేశంలోనే మరే చిత్రకారుడూ చిత్రించలేదు. అందువల్లే రాజయ్య శత జయంతి ఉత్సవం ఒక్క తెలంగాణకు, తెలుగు రాష్ట్రాలకు పరిమితం కారాదు, దేశంలోని బహుళ ప్రజానీకపు బతుకులకు ఈ వేడుక పునరుజ్జీవన కానుక. ఒక ఎరుక. గణన. అందుకే సరికొత్తగా అనడం, వారి కళ సహస్ర వృత్తుల సమస్త చిహ్నం అని. అది ఒకనాడు కేవలం బతుకమ్మ బొమ్మగానే కానవచ్చింది. కానీ నేడు వారి శత జయంతి సమయానికి, ఒక్కో కులానికి చెందిన వారి బొమ్మలన్నీ తీరొక్క పూల వంటి ఒక సాంస్కృతిక సమ్మేళనంగా, ఒక గణనీయమైన వైవిధ్యంగా మన ముందకు వచ్చాయని. అదే దేనికదే నిజమైన ‘బతుకమ్మ’. విభిన్న పండుగగా చూడాలి. ఇక వారి ఒక్కో బొమ్మను లెక్కించి చూడాలి. అదే వారికి మనమిచ్చే ఘనమైన నీరాజనం.

మీకు ఈ నట్స్ గురించి తెలుసా..?

రోజూ గుప్పెడు తినండి చాలు, ఎన్నో లాభాలను పొందవచ్చు..!

బాదంపప్పు, పిస్తా, జీడిపప్పు.. ఇలా చాలా రకాల నట్స్ గురించి మనకు తెలుసు. కానీ మీరు ఎప్పుడైనా టైగర్ నట్స్ గురించి విన్నారా..? వీటిని మీరు సూపర్ మార్కెట్లలో చూసే ఉంటారు. కానీ వీటి పేరు టైగర్ నట్స్ అని మీకు తెలిసి ఉండదు. ఇతర నట్స్ లాగే ఈ నట్స్ కూడా మనకు అందుబాటులో ఉన్నాయి. వీటిని కూడా మనం ఆహారంలో భాగం చేసుకోవచ్చు. టైగర్ నట్స్‌ను చుఫా లేదా ఎర్త్ ఆల్మండ్స్ అని పిలుస్తారు. అయితే ఇవి నట్స్ జాబితాకు చెందుతాయి. కానీ భూగర్భంలో పండుతాయి. ఈ నట్స్ మీద ముడతలు పడినట్లు తొక్క ఉంటుంది. ఇవి కాస్త తియ్యగా, క్రీమ్ రుచిని కలిగి ఉంటాయి. సాధారణ నట్స్ అంటే అలర్జీ ఉన్నవారు టైగర్ నట్స్‌ను తీసుకోవచ్చు. టైగర్ నట్స్‌ను రోజూ గుప్పెడు మోతాదులో తింటే అనేక లాభాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఈ నట్స్‌ను తింటుంటే పలు వ్యాధులు నయం అవుతాయని అంటున్నారు.

జీర్ణ వ్యవస్థ ఆరోగ్యానికి..

టైగర్ నట్స్‌లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. పేగుల్లో మలం కదలికలు సరిగ్గా ఉండేలా చేస్తుంది. దీంతో మలబద్దకం తగ్గుతుంది. ఈ నట్స్‌లో రెసిస్టెంట్ స్టార్చ్ ఉంటుంది. ఇది కూడా ఫైబర్ లాగే పనిచేస్తుంది. ఈ నట్స్‌ను తింటే ప్రీ బయోటిక్ ఆహారంగా పనిచేస్తాయి. దీని వల్ల జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. దీంతో జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. టైగర్ నట్స్‌ను ఆహారంలో భాగం చేసుకుంటే జీర్ణ వ్యవస్థలో ఎంజైమ్‌ల ఉత్పత్తి మెరుగు పడుతుంది. ముఖ్యంగా అమైలేజ్, లైపేజ్, కాటలేజ్ అనే ఎంజైమ్‌లు ఉత్పత్తి అవుతాయి. ఇవి మనం తిన్న ఆహారాన్ని సులభంగా జీర్ణం అయ్యేలా చేస్తాయి. దీంతో గ్యాస్, కడుపు ఉబ్బరం, అజీర్తి తగ్గుతాయి.

గుండె సంరక్షణకు..

టైగర్ నట్స్‌ను తింటే మోనో అన్‌శాచురేటెడ్ కొవ్వులు లభిస్తాయి. ఇవి ఆరోగ్యకరమైన కొవ్వుల జాబితాకు చెందుతాయి. ఇవి శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. గుండె పోటు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. టైగర్ నట్స్‌లో అర్జినైన్ అనే అమైనో యాసిడ్ ఉంటుంది. ఇది రక్త నాళాలను వెడల్పుగా చేస్తుంది. దీంతో రక్త సరఫరా మెరుగు పడుతుంది. దీని వల్ల బీపీ నియంత్రణలో ఉంటుంది. హైబీపీ ఉన్నవారు రోజూ ఈ నట్స్‌ను తింటుంటే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. బీపీని అదుపులో ఉంచుకోవచ్చు. ఈ నట్స్‌లో విటమిన్ ఇ, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి గుండెను, రక్త నాళాలను సంరక్షిస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడి, వాపులను తగ్గిస్తాయి. దీంతో గుండె సురక్షితంగా ఉంటుంది.

డయాబెటిస్ ఉంటే..

టైగర్ నట్స్‌లో అధికంగా ఉండే ఫైబర్ కారణంగా తిన్న ఆహారంలో ఉండే పిండి పదార్థాలు రక్తంలో నెమ్మదిగా గ్లూకోజ్‌గా మారుతాయి. దీంతో షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. ఈ నట్స్‌లో ఉండే ఆర్జినైన్ అనే సమ్మేళనం ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచుతుంది. శరీరం ఇన్సులిన్‌ను మెరుగ్గా ఉపయోగించుకునేలా చేస్తుంది. దీని వల్ల షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారు ఈ నట్స్‌ను రోజూ తింటుంటే ఫలితం ఉంటుంది. టైగర్ నట్స్‌లో విటమిన్ సి, ఇ అధికంగా ఉంటాయి. అలాగే యాంటీ ఆక్సిడెంట్లు సైతం ఎక్కువగానే ఉంటాయి, ఇవి ఇన్ ఫెక్షన్లను తగ్గిస్తాయి. ఈ నట్స్‌లో అధికంగా ఉండే జింక్, ఐరన్ రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తాయి. టైగర్ నట్స్‌లో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. అందువల్ల ఈ నట్స్‌ను తింటే బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి. ఇలా టైగర్ నట్స్‌ను రోజువారి ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

కర్నూల్ లో ఘనంగా భావన డయా బెస్ట్ రైస్ షాప్ ప్రారంభం

కర్నూలు ఆగస్టు 26 (నిజం న్యూస్): చక్కెర నియంత్రణ, మెరుగైన ఆరోగ్యం అనే లక్ష్యంతో రూపొందించిన భావనా డయా బెస్ట్ రైస్ షాపు కర్నూలులో బుధవారం ఘనంగా ప్రారంభమైంది. అధినేత సుధీర్, గ్లోబల్ టౌన్షిప్ అధినేత ఖాజా మాలిక్ లు కలసి ప్రారంభించారు. కర్నూల్ నగరం ఎన్ ఆర్ పేట మున్సిపల్ ఆఫీసు ఎదురుగా రెండవ లైన్ అపోలో హాస్పిటల్ వెనుక ఈ షాప్ ని అందుబాటులోకి తీసుకొచ్చారు.ప్రస్తుత కాలంలో మారుతున్న ఆహారపు అలవాట్ల నేపథ్యంలో ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం అన్నారు.ఈ నేపథ్యంలో షుగర్ నియంత్రణతో పాటు మెరుగైన ఆరోగ్యాన్ని లక్ష్యంగా చేసుకుని భావనా డయా బెస్ట్ రైస్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చామని. అధినేత సుధీర్ జమ్మలమూడి అన్నారు. భావనా డయాబెస్ట్ రైస్ సుమారు 7 సంవత్సరాలుగా ఫారెన్ బిట్స్ ని ఇండియన్ బిట్స్ ని తీసుకొని క్రాస్ ఫీడ్ చేసి పుట్టించిన విత్తనమే భావన డయాబెటిస్ దాదాపు ఏడు సంవత్సరాలు రీసెర్చ్ పూర్తి చేసుకుని 72 కోట్ల రూపాయల ఖర్చుతో షుగర్ పేషెంట్స్ కొరకు కు అందుబాటులోకి రైస్ ని తీసుకొచ్చామని వివరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఖాజా మాలిక్ గ్లోబల్ టౌన్షిప్ అధినేత మాట్లాడుతూ కర్నూలుకు డయాబెటిస్ రావడం ఇక్కడి ప్రజల కోరికని ఆయన అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి కుటుంబంలో ఒకరు ఈ రోగం పారిన పడుతున్నారని దీనివల్ల జీవితాలు చిత్రమైతున్నాయని ఈ రైసు తీసుకోవడం వల్ల సుగర్ నియంత్రణలో ఉంటుందని అన్నారు. మన ప్రాంతంలో తెల్ల అన్నం తినడం ఒక ఆనవాయితీగా మారిందని దానిని మార్చుకోవడం అసాధ్యమైందని అందుకే ఈ రైస్ ను ఇక్కడికి తీసుకు రావడం జరిగిందన్నారు. కర్నూల్ దయా రైస్ డిస్ట్రిబ్యూటర్ సంజయ్ గౌడ్ మాట్లాడుతూ మా ఇంట్లో ఒకరు డయాబెటిస్ రోగాలపడి ఇబ్బంది పడుతున్న విషయం ప్రత్యక్షంగా చూశానని అందుకే ఈ రైస్ ను తీసుకురావాలని నిర్ణయించుకున్నట్లు ఆయన అన్నారు. నిర్వాహకులు, ప్రతినిధులకు రైస్ యొక్క ప్రత్యేకతలను వివరించారు. షుగర్ విషయంలో ఆందోళన తగ్గించి ఆరోగ్యకరమైన జీవనశైలికి తోడ్పడే ఆహారాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ రైస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు.ఈ రైస్‌కు సంబంధించిన ప్రత్యేకతలు, వినియోగ విధానం, మార్కెట్లో లభ్యత వంటి అంశాలను వివరించారు.కార్యక్రమంలో పలువురు నిర్వాహకులు, వ్యాపార ప్రతినిధులు పాల్గొని భావనా డయా బెస్ట్ రైస్‌ను ప్రజలకు పరిచయం చేశారు. ఆరోగ్యంపై శ్రద్ధ పెరుగుతున్న ఈ రోజుల్లో... ఆరోగ్యకరమైన ఆహార ఎంపికలకు ప్రాధాన్యత పెరుగుతోంది.ఈ నేపథ్యంలో భావనా డయాబెస్ట్ రైస్ ను వినియోగదారుల వినియోగించుకుని ఆరోగ్యాన్ని అదుపులో పెట్టుకోవాల్సిందిగా కోరారు.